నగరం ప్రత్యక్ష నరకం!

- ట్యాంకర్ డ్రైవర్ల మెరుపు సమ్మెతో నిలిచిన పెట్రోలు సరఫరా
- బంద్ సమాచారంతో పెట్రోల్ బంకులకు పరుగులు
- ఇంధన కంపెనీల ప్రతినిధుల చొరవతో ఆందోళన విరమణ
- హైదరాబాద్‌లోని పలు చోట్లకు పెట్రోల్ స్టాక్ సరఫరా



హైదరాబాద్‌లోని ఓ బంకులో పెట్రోలు, డీజిల్ కోసం ఎగబడిన వాహనదారులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు.. బంకుల ముందు క్యూ కట్టిన వాహనదారులు.. ఎక్కడ చూసిన కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. ఒక్క మాటలో చెప్పాలంటే వాహనదారులు పట్టపగలే ప్రత్యక్ష నరకం చూశారు. ఇదీ మంగళవారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు నగరాల్లో కనిపించిన పరిస్థితి. హిట్ అండ్ రన్ కేసులో శిక్షణ పెంచుతూ కేంద్రం తెచ్చిన సవరణను వ్యతిరేకిస్తూ పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్లు మంగళవారం మధ్యాహ్నం నుంచి మెరుపు సమ్మెకు దిగారు. దీంతో పెట్రోల్ బంకులకు ఎక్కడికక్కడ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వాహనదారులు పెట్రోల్ బంకులకు పరుగులుపెట్టారు. కొద్ది సమయంలోనే పెట్రోల్ బంకులన్నీ వాహనదారులతో కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్‌లో పెట్రోల్ బంకుల వద్ద ఎక్కడ చూసినా భారీ సంఖ్యలో వాహనదారులు పెట్రోల్ కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. నగరం మొత్తం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోవడం గమనార్హం. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కనిపించింది.

రాష్ట్రమంతా నో స్టాక్

రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్ల సమ్మె ప్రభావం పడింది. ఏ పెట్రోల్ బంకులో చూసినా నో స్టాక్ బోర్డులే దర్శనమిచ్చాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను రూ. 6-10 వరకు తగ్గించే అవకాశం ఉందనే సమాచారంతో బంకుల యజమానులెవరూ ఎక్కువ స్టాక్ పెట్టుకోలేదు. ఒకవేళ ధరలు తగ్గిస్తే తమకు నష్టం వస్తుందనే ఉద్దేశంతో 30, 31వ తేదీల్లో అవసరం కన్నా తక్కువగానే యజమానులు పెట్రోల్ స్టాక్స్ తెప్పించుకున్నారు. దీంతో సమ్మె ప్రభావం వాహనదారులపై వెంటనే చూపింది.

బిల్లును పూర్తిగా పరిశీలించాకే కార్యాచరణ

ప్రజలు అవస్థలు పడటంతో ట్యాంకర్స్ అసోసియేషన్ స్పందించింది. బిల్లును పూర్తిగా పరిశీలించిన తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిద్దామని పెట్రోల్-డీజిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పిలుపునివ్వడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి ట్యాంకర్లు బయటికి కదిలాయి.

వాహనదారుల ఆందోళన వద్దు: డీఎస్ చౌహాన్

పెట్రోల్ కొరత తీవ్రమై పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆయిల్ కంపెనీల అధికారులతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సమావేశం నిర్వహించి, పరిస్థితిపై సమీక్షించారు. పెట్రోల్ కొరత లేకుండా చూసి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వాహనదారులెవరూ ఆందోళన చెందొద్దని, కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయన సూచించారు.

నేటి నుంచి బీఆర్ఎస్ సమావేశాలు

- లోక్ సభ ఎన్నికలకు గులాబీ పార్టీ సన్నాహకం
- ఆదిలాబాద్‌తో ప్రారంభం
- తెలంగాణభవన్‌లో భేటీలు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బుధవారం నుంచి సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నెల 21 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, పార్టీ నేతలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మధుసూధనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు సమావేశాలను నిర్వహించనున్నారు. రెండు విడతల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడతలో జనవరి 3 నుంచి 12 వరకు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడురోజుల విరామమిస్తారు. తిరిగి జనవరి 16 నుంచి మిగిలిన నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు కొనసాగిస్తారు. మొదట ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఒక లోక్‌సభ నియోజకవర్గం నాయకులతో సమావేశమై, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తారు. మీటింగ్‌కు హాజరయ్యే ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకుని కార్యాచరణను రూపొందిస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. సమావేశాలకు ఆయా లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలందరినీ ఆహ్వానించారు. ఎంపీలు, నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సమావేశాలకు హాజరుకానున్నారు.

సన్నాహక సమావేశాల తేదీలు

జనవరి 3న ఆదిలాబాద్, 4న కరీంనగర్, 5న చేవెళ్ల, 6న పెద్దపల్లి, 7న నిజామాబాద్, 8న జహీరాబాద్, 9న ఖమ్మం, 10న వరంగల్, 11న మహబూబాబాద్, 12న భువనగిరి, 16న నల్లగొండ, 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజిగిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్.

కేటీఆర్‌కు హార్వర్డ్ ఆహ్వానం

- 21వ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని వినతి
- ఆహ్వాన పత్రం అందించిన హార్వర్డ్ విద్యార్థులు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని బోస్టన్ నగరంలో ఉన్న ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ 21వ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రసంగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు హార్వర్డ్ బిజినెస్ స్కూల్ గ్రాడ్యూయేట్ విద్యార్థులు మంగళవారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న ఈ కార్యక్రమం జరగనున్నది. గడచిన పదేండ్లలో తెలంగాణ సాధించిన వృద్ధిలో కేటీఆర్ ప్రభావవంతమైన నాయకత్వం, రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చిన తీరు తమకు ఎంతో స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. 'తెలంగాణ, భారత దేశ భవిష్యత్తు అవకాశాలపై మీ ఆలోచనలు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. జ్ఞానాన్ని అందిస్తాయని దృఢంగా విశ్వసిస్తున్నాం' అని ఆహ్వానంలో తెలిపారు. హార్వర్డ్‌లోని ఇండియా కాన్ఫరెన్స్ అమెరికాలో విద్యార్థులతో నిర్వహించబడే అతిపెద్ద సదస్సు. విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యాపార ప్రముఖులు, విధాన నిర్ణేతలుసహా వెయ్యిమంది వరకు ప్రవాస భారతీయులు ఇందులో పాల్గొంటారు.

అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ నియామకం రద్దు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): అధికార భాషా సంఘం చైర్‌పర్సన్‌గా మంత్రి శ్రీదేవి నియామకాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వెంటనే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఆమె వద్ద కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది నియామకాలు కూడా రద్దు అయినట్టు తెలిపారు. ఆమె కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు వెంటనే సొంత శాఖల్లోకి వెళ్లాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లోకం పోకడ



ఆఫీస్‌కు వెళ్లొస్తానే.. జాగ్రత్త.. బయటికెళ్లకు!

5 నుంచి సమ్మెకు వెళ్తాం

ఆర్టీసీ అద్దెబస్సుల యాజమాన్యం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ అద్దె బస్సుల యాజమాన్యం సమ్మెకు సిద్ధమైంది. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించని పక్షంలో 5 నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించింది. అద్దె బస్సులకు నిర్వహించిన టెండర్లలో కూడా అద్దె బస్సుల యాజమానులు పాల్గొనలేదు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలు తమ బస్సులలో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారని, మైలేజీ తగ్గుతుందని, బస్సులు పాడవుతున్నాయని అదె బస్సుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులున్న సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇన్సూరెన్స్ వర్తించదని, దీంతో బస్సు యాజమాన్యం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	10.7°c	33.8°c
ఆదిలాబాద్	13.0°c	32.2°c
మెదక్	13.2°c	32.9°c
నల్లగొండ	15.6°c	31.6°c
నిజామాబాద్	16.9°c	30.3 °c
ఖమ్మం	17.0°c	29.0°c
హైదరాబాద్	17.4°c	27.4°c
మహబూబ్‌నగర్	17.5°c	30.0°c
కరీంనగర్	18.0°c	29.0°c
వరంగల్	18.0°c	28.0°c

కాంగ్రెస్, బీజేపీ నేతలు తోడు దొంగలు

- తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి
- దుబ్బాకలో సభలో ఎమ్మెల్యే హరీశ్

దుబ్బాక, జనవరి 2: కాంగ్రెస్, బీజేపీ నేతలు తోడుదొంగలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకిచ్చిన ప్రతి హామీతోపాటు ఇవ్వని హామీలెన్నింటినో నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీది అయితే.. మాటలు తప్ప ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు కేంద్రంలో అధికారంలోకి రావాలనే ఆలోచన తప్ప తెలంగాణ ప్రజల బాగోగులు పట్టడం లేదని మండిపడ్డారు. భవిష్యత్తులో ఢిల్లీలో గొంతు విప్పలన్నా, రాష్ట్ర హక్కులు సాధించుకోవాలన్నా బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కాబట్టి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి బుద్ధిచెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని హెచ్చరించారు. కరోనా కష్టకాలంలోనూ ఉద్యోగులకు సగం వేతనాన్ని ఇచ్చినా, కేసీఆర్ సర్కార్ ప్రజలకు మాత్రం అన్ని సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు.

దుబ్బాక ఉద్యమాల గడ్డ

దుబ్బాక అంటే ఉద్యమాలకు కేరాఫ్ అని ఎమ్మెల్యే హరీశ్‌రావు గుర్తుచేశారు. శాసనసభ ఎన్నికల్లో దుబ్బాక సత్తాను చాటి చెప్పారని అభినందించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తిపోటుకు గురై దవాఖానలో ఉంటే...కార్యకర్తలు సైనికులుగా పని చేసి గెలిపించారని కొనియాడారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, దుబ్బాక జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్ట్.. మరో టెస్ట్!

- స్టాఫ్‌నర్స్ మెరిట్ జాబితాపై గగ్గోలు
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 9,892 మంది ఎంపిక
- జోన్లవారీ జాబితా లేక అయోమయం
- అవకతవకలు జరిగాయని ఆరోపణ

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): స్టాఫ్ నర్సుల నియామకాలకు ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన మెరిట్ జాబితా తీవ్ర గందరగోళానికి తెరలేపింది. 9 విభాగాల్లో 7,094 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి వైద్యారోగ్య శాఖ గత నెల 28వ తేదీన మెరిట్ జాబితాను విడుదల చేసింది. బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీ ప్రాంగణంలో జనవరి 30న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలైంది. ఈ పోస్టులకు సుమారు 40 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారం దరి మార్కులతో మెరిట్ జాబితాను విడుదల చేశారు. మార్కుల ఆధారంగా విడుదలైన ఈ జాబితా ఏకంగా 1,419 పేజీలు ఉన్నది. ఇందులో తమ పేరును వెతుక్కోవడంతోపాటు ఆ జోన్ పరిధిలో ఏ క్యాటగిరీ వారికి అత్యధికంగా ఎన్ని మార్కులు వచ్చాయన్న వివరాలను తెలుసుకోవడం అభ్యర్థులకు సాధ్యం కాలేదు.

వెరిఫికేషన్ ఎలా సాధ్యం?

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 9,892 మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేశారు. ఇది 200 పేజీలు ఉన్నది. ఇందులో కేవలం అభ్యర్థి అప్లికేషన్ నంబర్, హాల్ టికెట్ నంబర్ మాత్రమే నమోదు చేశారు. జోన్లవారీగా ఫలితాలు ఇవ్వలేదు. కనీసం అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు జోన్, రిజర్వేషన్ క్యాటగిరీ లాంటి వివరాలేమీ లేవు. దీంతో ఒక్కో హాల్‌టికెట్ నంబర్‌ను 1,419 పేజీల మెరిట్ లిస్ట్‌లోని వివరాలతో చెక్ చేసుకోవాల్సి వచ్చింది. తమకన్నా తక్కువ మార్కులు వచ్చినవారిని ఎంపిక చేశారంటూ కొందరు అభ్యర్థులు ఇటీవల డీఎంఈ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. మరికొందరు స్టాఫ్ నర్స్ నియామకాల్లో అవకతవకలు జరిగాయని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికైనా జోన్లు, రిజర్వేషన్ క్యాటగిరీల వారీగా మెరిట్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జాబితాలను విడుదల చేసి తమ అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు.

52 మార్కులు వచ్చినా..

మాది 5వ జోన్. స్టాఫ్ నర్స్ పరీక్షలో 52 మార్కులు సాధించిన నాకు జనరల్ లేదా ఎస్టీ క్యాటగిరీలో కచ్చితంగా ఉద్యోగం వస్తుందని అనుకున్నాను. కానీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ లిస్ట్‌లో నా పేరు లేదు. 9 వేల మంది హాల్‌టికెట్ల వివరాలు క్రాస్ చెక్ చేయడం నాకే కాదు ఎవరికైనా అసాధ్యమే. ఇవన్నీ చూస్తుంటే జాబితాలో అవకతవకలు జరిగాయన్న అనుమానం కలుగుతున్నది.

– బానోతు నిర్మల, సూర్యాపేట జిల్లా

సెలక్షన్ లిస్ట్ మాత్రమే జోన్లు, క్యాటగిరీల వారీగా ఇస్తాం

ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఎంహెచ్ఎస్ఆర్బీ అధికారులను కోరగా.. ఉద్యోగాలకు ఎంపికైన తుది అభ్యర్థుల జాబితాను మాత్రమే జోన్లు, క్యాటగిరీల వారీగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అందులో ఏవైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు తమను సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే ఎక్సైజ్ అకాడమీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతున్న కేంద్రానికి వచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రో లేనట్టే!

మొదటిపేజీ తరువాయి...

సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మూసీని అనుసరిస్తూ నార్సింగి నుంచి తారామతిపేట వరకు (ఈస్ట్ టు వెస్ట్) 40 కిలోమీటర్లు, కేసీఆర్ ప్రభుత్వం ఆమోదించిన ప్యారడైజ్-కండ్లకోయ, జేబీఎస్-శామీర్‌పేట డబుల్ డెక్కర్ మెట్రో ప్రాజెక్టులపైనా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

మెట్రోలో ఎక్కువ మంది తిరగాలి

మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలపై సీఎం నిర్వహించిన సమీక్షలో ఎంఎయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా చేపట్టే మెట్రో మార్గాలు ఎక్కువ మంది ప్రజలకు అనుకూలంగా ఉండేలా చూడాలని సూచించారు. పాతబస్తీలో దార్-ఉల్-షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మీదుగా నిర్మించే మార్గం కోసం రోడ్డును 100 అడుగుల విస్తీర్ణంతో చేపట్టాలని, ఇందుకోసం స్థానిక ప్రజా ప్రతినిధులను సంప్రదించి, రోడ్డు విస్తరణ పనులు సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. పాతబస్తీ మీదుగా మెట్రో రైలు మార్గం నిర్మాణం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

రాయదుర్గం-ఎయిర్‌పోర్టు మెట్రో నిలిపివేత

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించి, పనులు మొదలుపెట్టిన రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (31 కిలోమీటర్లు) హోల్డ్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం ఆ మార్గంలో ఔటర్ రింగురోడ్డు అందుబాటులో ఉన్నదని, దానికి బదులుగా ఎయిర్‌పోర్టుతో మెట్రో అనుసంధాన మార్గాన్ని ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా చేపట్టాలని సూచించారు. వాస్తవానికి రాయదుర్గం నుంచి విమానాశ్రయానికి మెట్రోను ప్రతిపాదించినప్పుడు ప్రయాణికుల బ్యాగేజీ చెకింగ్‌ను కూడా అక్కడే పూర్తిచేయాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని భావించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇప్పుడిది గందరగోళంలో పడింది.

త్వరలో కేంద్ర మంత్రితో సమావేశం

నగరంలో మెట్రోరైలు కొత్త మార్గాల ప్రతిపాదనలపై త్వరలోనే కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్‌ను కలవాలని, ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 40 కిలోమీటర్ల పొడవున ఉన్న మూసీ తీర ప్రాంతంలో మెట్రో రైలు కారిడార్‌ను నిర్మించేందుకు పురపాలక శాఖ, మెట్రో అధికారులు కలిసి పని చేయాలని, నాగోల్, ఎంజీబీఎస్‌ల మీదుగా మూసీ వెంట నార్సింగి నుంచి తారామతిపేట వరకు ఈ మెట్రో రైలుమార్గం అనుసంధానం అయ్యేలా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం సూచించారు.శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా కందుకూరు వరకు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉంటుందని, దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. కందుకూరు ప్రాంతంలో మెగా టౌన్‌షిప్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నదని, దానికి అనుగుణంగా మెట్రో మూడో దశను సిద్ధం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటితోపాటు జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి షామీర్‌పేట, ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి కండ్లకోయ వరకు మెట్రో మార్గాలను నిర్మిస్తామని తెలిపారు.

ట్రాఫిక్‌పై త్వరితగతిన అధ్యయనం

కొత్తగా ప్రతిపాదిస్తున్న మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అధ్యయనాన్ని వీలైనంతంగా వేగంగా పూర్తి చేసి, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించాలని సీఎం సూచించారు. పాతబస్తీ, ఎల్బీనగర్ మీదుగా ఎయిర్‌పోర్టు లోపలివరకు నిర్మించే మెట్రో అలైన్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. లక్ష్మీగూడ-జల్‌పల్లి-మామిడిపల్లి మార్గంలో రోడ్డు మీదుగా మెట్రోవైన్ (ఎట్ గ్రేడ్)ను కొత్త అలైన్‌మెంట్‌లో నిర్మించేలా అధ్యయనం చేయాలని కోరారు. ఇన్నర్ రింగురోడ్డు నుంచి మైలార్‌దేవ్‌పల్లి వద్ద ప్రారంభమయ్యే ఈ మార్గంలో గతంలో హెచ్ఎండీఏ నిర్మించిన పీ-7 రోడ్డులో 40 అడుగుల విస్తీర్ణంతో కూడిన సెంట్రల్ మీడియన్ స్థలం అందుబాటులో ఉండడంతో తక్కువ ఖర్చుతోనే నిర్మించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా దానకిశోర్‌కు, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ వీ శేషాద్రికి సీఎం పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు వరకు నిర్మిస్తున్న మార్గంలో ప్రభుత్వ భూములు ఉంటే గుర్తించాలని, వాటిని రవాణా అధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్) కేంద్రాలుగా మార్చాలని ఆదేశించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణానికి వెచ్చించాలని అన్నారు.

హోల్డ్‌లో దళిత'బంధు'వులు

- రెండో విడత లబ్ధిదారుల అకౌంట్లు ఫ్రీజ్
- నిధులు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- పథకం కొనసాగింపుపైనా రాని స్పష్టత
- తొలి విడతలో లబ్ధిదారులకు మొత్తం నిధులిచ్చిన కేసీఆర్ సర్కార్
- మలి విడతలో లబ్ధిదారుల ఎంపిక.. ఎన్నికల కోడ్ అడ్డొచ్చి ప్రక్రియకు బ్రేక్

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టినట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులందరికీ ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున నిధులు విడుదల చేసి వారిని ఆర్థికాభివృద్ధి వైపు నడిపించింది. రెండో విడతలో కూడా లబ్ధిదారులను ఎంపిక చేసి.. సగం మందికి నిధులు కూడా విడుదల చేసింది. ఇంతలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చి పథకం అమలు ప్రక్రియకు బ్రేకులు వేసింది. దీంతో లబ్ధిదారులంద రూ.. ఎన్నికల య్యాక.. కొత్త ప్రభుత్వం వచ్చి తమకు నిధులు విడుదల చేస్తుందని ఆశగా ఎదురుచూశారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా.. దళితబంధు గురించి పట్టించుకోవడం లేదని నిరాశ చెందుతున్నారు. గ్రౌండింగ్ చేసిన యూనిట్లకైనా నిధులు విడుదల చేయడం లేదని వాపోతున్నారు. పైగా.. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో.. ఇంతకు దళితబంధు ఉంటుందా? ఊడుతుందా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లికి చెందిన లబ్ధిదారు ఓరుగంటి కవిత మాట్లాడుతూ.. ఆరు నెలల కింద తన భర్త ఓరుగంటి సమ్మయ్య పేరు మీద దళితబంధు వచ్చిందని, మొదట రూ.5 లక్షలు ఇస్తే కిరాణా షాపు పెట్టుకున్నామని తెలిపింది. ఎన్నికల కోడ్ వల్ల పెండింగ్‌లో ఉన్న రూ.5 లక్షలు ఇవ్వలేదని పేర్కొన్నది. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్‌నగర్‌వాసి పొట్ట ముత్యాలి మాట్లాడుతూ.. 'నా భర్త మేస్త్రీ పనిచేస్తున్నాడు. నేను ఇండ్లలో పని చేస్తున్న. దళితబంధుకు నన్ను ఎంపిక చేయడంతో మా కష్టాలన్నీ తీరిపోతయని సంతోషపడినం. దుకాణం పెట్టుకుని జీవితానికి కొత్త బాటలు వేసుకోవాలనుకున్నం. అధికారులు చెప్తే అకౌంట్ కూడా తీసిన. నేడో, రేపో అకౌంట్‌లో డబ్బులు పడుతయని అనుకుంటే ఖాతా ఫ్రీజ్ అయినట్టు చెప్తున్నరు' అని వాపోయింది.

రెండో విడతలో ఫ్రీజ్ అయిన ఖాతాలు	
జిల్లా	లబ్ధిదారులు
రంగారెడ్డి	8000
సూర్యాపేట	4,400
భూపాలపల్లి	1,405
ములుగు	1,100

దళితబంధు వర్తింపజేయాలి

దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వం అమలు చేసిన విధంగానే ఈ ప్రభుత్వం కూడా దళితబంధు పథకాన్ని అర్హులైన ప్రతి దళితుడికి అందించాలి. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారుల కోసం అప్పటి ప్రభుత్వం నిధులను సైతం కేటాయించింది. జిల్లాలోని 1,100 మంది లబ్ధిరులకు గ్రౌండింగ్ చేసి వారు ఎన్నుకున్న యూనిట్లను అందజేయాలి. ఇప్పటికే పథకం కోసం పలువురు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించాం. కొత్త ప్రభుత్వం అర్హులైన దళితులకు న్యాయం చేయాలి.

– కోగిల మ